# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ వృద్ధి రేటులో రాష్ట్రం 2వ స్థానంలో ఉండడం హర్షణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ శ్రీరామనవమి ఉత్సవాలను రాష్ట్ర ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.
- ❖ కేంద్ర ప్రభుత్వ నిధులతో శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.
- ❖ పేదరిక నిర్మూలన కోసం పీ4 పేరుతో కార్యక్రమాలను చేపడుతున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ❖ రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను రాష్ట్రం దేశంలోనే 2వ అత్యధిక వృద్ధి రేటును నమోదు చేసినట్లు సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ తాజా నివేదిక వెల్లడించినట్లు ఈ రోజు సామాజిక మాధ్యమంలో తెలిపారు. ఈ గణాంకాల ప్రకారం రాష్ట్రం 8.21 శాతం వృద్ధిని సాధించిందని అన్నారు. వ్యవసాయం, తయారీ, సేవల రంగాలలో విస్తృత పునరుజ్జీవనం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, పునరుత్పాదక ఇంధన రంగాలలో భారీ పెట్టుబడులు ఈ ప్రగతికి చోదకాలుగా నిలిచాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. కలసికట్టుగా కృషి చేసి రాష్ట్రానికి మరింత ఉజ్వలమైన భవిష్యత్ ను నిర్మిద్దామని ప్రజలకు చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

========================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు శ్రీరామనవమి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి శ్రీరామ నవమి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు నెల్లూరు జిల్లాలోని చౌటపాళెంలోని రామాలయంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రం అయిన విజయనగరం జిల్లా రామతీర్థంలో జరిగిన సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, విజయనగరం శాసనసభ్యురాలు అతిథి గజపతిరాజు తదితరులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖపట్నం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. అనంతపురంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో ఉన్న సీతారామంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన సీతా రాముల కళ్యాణ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. శ్రీరామ నవమి పురస్కరించుకుని తిరుమలలో రంగనాయకుల మండపంలో శ్రీ సీతా లక్ష్మణ సమేత హనుమంతుల వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో వేడుకగా శ్రీరామనవమి ఉత్సవాలు జరిగాయి.

========================

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి కోసం బృహత్తర ప్రణాళికను రూపొందిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ పునర్నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్లతో కలసి కేంద్ర మంత్రి మార్కెట్ ప్రాంగణాన్ని ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకుని రావడం ద్వారా జిల్లాను అభివృద్ధి చేస్తామని తెలిపారు. నది పరివాహక ప్రాంతంగా ఉన్న నగరంలో పార్కులు, నూతన మున్సిపల్ కార్యాలయం వంటి పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నట్లుగా చెప్పారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు.

========================

రాష్ట్రంలో పేదరికం నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఈ రోజు ఆమె దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... విజన్- 2047, పీ-4 కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రగతితోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

========================

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈరోజు తెల్లవారు జామున సుప్రభాతసేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్ కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

========================

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాజమహేంద్రవరంలో ఈ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలో బీజేపీ నానాటికీ విస్తరిస్తోందని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని బిజెపి కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధితో కూడిన సుపరిపాలన సాగుతోందన్నారు. ఒంగోలు నగరంలో ఈ రోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు మాట్లాడుతూ... దేశంలోని ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అందిస్తోందని అన్నారు.

========================

ఆగ్నేయ బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న 48 గంటలలో దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి పేర్కొంటూ..

(వాయిస్ 24 సెకన్లు)

========================

========================